# ఒకటో నెంబర్ బెడ్

రాంశాస్త్రికి వచ్చిన జబ్బేమిటో అతనికి అర్థం కాలేదనడంలో కొంత సబువూ, సందర్భమూ ఉన్నాయి. ఏం అంటే, రాంశాస్త్రి మేధకుడు. పాతికేళ్ళుపైమీదకొచ్చి పచ్చగా కలకల్లాడే ముఖంమీద, నల్లని పట్టుకుచ్చులాంటి గెడ్డం, తుమ్మెద రెక్కల్లా ంటిమీసాలూ చోటుచేసుకున్నా, దబ్బపండులాంటి అందమైన ఆ విగ్రహంలో వయస్సు తాలూకు మిసమిసలు స్పష్టంగా కనిపిస్తూవున్నా, చదువుకున్న విద్యాప్రవీణకి సంబంధించిన సంస్కృత విజ్ఞానం అంతా కళ్ళల్లో జ్యోతుల్లాగ దేదీప్యమానంగా వెలిగిపోతూ ఉన్నా, మానసిక పరిణామం దృష్ట్యా మాత్రం, అతనింకా మాసాలు నిండని పసివాడే.

సంస్కృత కళాశాల్లో అతను అధ్యాపకుడుగా చేరి దాదాపు రెండేళ్ళు కావస్తూన్నా, ప్రధానోపాధ్యాయుడతణ్ణి ఈ రోజుకీ చంటిపాపని చూసినట్లే చూస్తాడు. తోటి అధ్యాపకులు సరేసరి "ఏం రాంశాస్త్రీ! పాలు తాగావా? ఏమిటీ మధ్యన విద్దెంచేస్తున్నావుట! నువ్వు పుట్టాక ఎప్పుడేనా కాఫీ తాగావా? సినిమా చూశావా? ఎన్నాళ్ళిలా ఒక్కడివీ ఒండుకు తింటావోయ్! హాయిగా పెళ్ళి చేసుకోకూడదూ?" అంటూ రకరకాల ప్రశ్నలువేసి ఆడిస్తూంటారు. ఎవరు ఏం అన్నా "వాళ్ళు పెద్దవాళ్ళు, ఏదో మన శ్రేయస్సు కోరే చెప్తున్నారు" అనుకుంటాడు కాని 'పరాచికాలు ఆడుతున్నారు. తనని ఆడిస్తున్నారు కాబోలు' అనే ఆలోచనేరాదు రాంశాస్త్రికి. పూర్తిగా పద్దెనిమిదవ శతాబ్దానికి చెందిన అతని వేషం చూస్తే ఇంక విద్యార్థులకి ఆటే!

నెత్తిమీద జానెడుపిలకా, చెవిలోనిత్యమల్లెపువ్వూ, చెవులకి చిన్నప్పుడు పెద్దాళ్ళు కుట్టించిన పాలకాయలూ, నొసటను వీభూతీకుంకం, ఉతికి ఆరేసిన ముడతలు పడ్డజుబ్బా, మడతలు వచ్చేలా అందంగా కట్టుకున్న బిళ్ళగోచీ పంచె కట్టూ, చెప్పులు లేని పాదాలూ.

ఈ రూపంలో రాంశాస్త్రి ప్రత్యక్షం అయేసరికి చక్కిలిగింతలు పెట్టినట్లు

విద్యార్థులంతా ఏకనవ్వులే. ప్రవరాఖ్యుడొచ్చాడు ప్రవరాఖ్యుడంటూ ఒక టేపకపకలు. అయితే బయట యింతగా నవ్వినా, క్లాసులో మాత్రం, రాంశాస్త్రి పాఠం చెబుతూవుంటే ఒక్కడూ కిక్కురుమనడు. అతను పద్యాన్నికాని, శ్లోకాన్ని కాని శ్రావ్యంగా చదివి, చక్కగా విడమరచి అర్థం చెబుతూవుంటే, పదేళ్ళ కుర్రాడికి కూడా అర్థం అవుతుంది అనే మంచి పేరుంది రాంశాస్త్రికి. అందువల్లే అతను యెంత పూర్వకాలపు మనిషి అయినా ఆ కళాశాలలో నెగ్గుకు రాగలుగుతున్నాడు.

అటువంటి రాంశాస్త్రికి ఈ మధ్య, అంటే నాలుగైదు నెలలనుంచి తగని జబ్బు ఒకటి పట్టుకుంది. ఉండుండి ఒళ్ళు వేడెక్కిపోవడం, నరాలన్నీ పట్లు తప్పడం, ఏ పనిచేద్దాం అన్నా బుద్ధి నిలకడగా ఉండకపోవడం, ఏకబద్ధకం చిరాకూ, మధ్యమధ్య పరాకూ, తల ఒక్కొక్కప్పుడు దిమ్ముగా బరువుగా వుండడం, ఆ బరువు క్రమంగా వంటికంతకీ పాకడం, మళ్ళీ హఠాత్తుగా ఆ బరువంతా పోయి శరీరం దూదికంటే తేలిగ్గా మారిపోవడం. అన్నంసయించకపోవడం, ఒక్కొక్కప్పుడు నాడి విపరీతంగా కొట్టుకోవడం, పగలూ రాత్రీ ఏదో తిక్క, రాత్రిళ్ళు ఎంత సేపటికీ నిద్ర పట్టకపోవడం, యిలా చెప్పుకుంటూ పోతే చాలా వున్నాయి.

ఈ లక్షణాలన్నీ చెప్పేసరికి ఒకళ్ళిద్దరు మేష్టర్లు 'అయ్యో' అంటూ సానుభూతి చూపించారు. "ఇదేదో తీవ్రమైన వ్యాధిలాగే వుంది. చప్పున ఏ వైద్యమో చేయించుకో - సోమాచారి యిచ్చే ఆ మాత్రలూ అల్లపరసం కాదు. పదిరోజులు శలవుపెట్టి ఏ జనరల్ హాస్పటల్‌లోనైనా చేరు" అంటూ సలహా యిచ్చారు. శలవుకోసం ప్రధానోపాధ్యాయుణ్ణి కలుసుకున్నప్పుడు "నిన్న మొన్నటి కుర్రాడికి, యిదేమిటి పాపం యిలా వచ్చింది" అంటూ తెగ మధనపడ్డాడు. అందరూ తన పట్ల యిలా సానుభూతి కనపరిచేసరికి, రాంశాస్త్రి బెంగపెట్టుకుని భయపడసాగాడు. జనరల్ హాస్పటల్‌లో చేరింది లగాయతు 'నాకు వచ్చిన ఈ జబ్బేవిటి? ఇది తగ్గుతుందా? నేను అసలు బతుకుతానా బతకనా?' అన్న జిజ్ఞాసే రాంశాస్త్రికి.

సరే - రాంశాస్త్రికి తెలియదు ఈ జబ్బేమిటో. అతనేమైనా వైద్య శాస్త్రం చదివాడా, డాక్టర్ పరీక్షలు పేసయ్యాడా? అతనేమైనా వైద్యం చేశాడా, ఆ మార్గంలో అనుభవం గడించాడా? అందువల్ల అతనికి తెలియలేదంటే సబుబూ, సందర్భం వుంది. మరి ఈ డాక్టర్ల మాటేవిటి? మళ్ళీ ఒక్కొక్కళ్ళు ఎమ్.డీ.లు, ఎమ్.ఎస్.లూ పేసయ్యారే! కొందరు విదేశాలు వెళ్ళి పెద్ద పెద్ద డిగ్రీలుకూడా తెచ్చుకున్నారు. ఏ రోగాన్నైనా ఇట్టే నయంచేసిపారేస్తారనే బ్రహ్మాండమైన పేరూ సంపాదించారు. అలాంటి హేమాహేమీలైన

డాక్టర్లకి అంతు చిక్కకపోవడమేమిటి ఈ రోగం? ఇలాంటి జబ్బు యింతక్రితం ఎవరికో యిద్దరు ముగ్గురికి వచ్చిందన్న సంగతి లీలగా జ్ఞాపకం ఉండడంతప్ప, అసలిది ఏం జబ్బో, దీని పేరేమిటో, వాళ్ళెంత తలలు బద్దలు కొట్టుకున్నా నిర్ణయించలేకపోయారు. కిందా మీదా పడి తర్జన భర్జనలుచేసి చివరకి రాంశాస్త్రిని హాస్పటల్‌లో ఎడ్మిట్ చేసుకోడానికీ, నాలుగైదురోజులు కేసు అబ్జర్వేషన్‌లో పెట్టడానికీ, ఈలోపుగా డాక్టర్లంతా స్టడీచేసి ఎవరి ఫైండింగ్స్ వాళ్ళు నోట్ చేసి రెడీ చెయ్యడానికీ, తర్వాత అందరూ కలిసి కూచుని అసలు జబ్బేవిటో చర్చించి ఒక అభిప్రాయానికి రాడానికీ నిర్ణయం చేసుకున్నారు. ఈలోగా రాంశాస్త్రికి స్పెషల్ వార్డులో ఆ చివరనున్న ఒకటో నెంబర్ బెడ్ ఎలాట్ చేసి, ఆ రోగిని కొంచెం ప్రత్యేకంగా కనిపెట్టి చూస్తూ వుండవలసిందిగా డ్యూటీ నర్సు పంకజాన్ని ఆదేశించారు హాస్పటల్ అధికారులు. "ఏదో సీరియస్ కేసట. ఒకటో నెంబర్ బెడ్ మీదకి వచ్చిందట" అనే గుస గుసలు క్రమక్రమంగా హాస్పటల్‌లో వున్న స్టాఫ్ నుంచి పేషెంట్స్ దాకా పాకి, మొత్తం మీద అందరికీ రాంశాస్త్రిపట్ల విశేషమైన ఆదరణనీ, సానుభూతినీ సంపాదించి పెట్టాయి. దానికి తోడు రాంశాస్త్రిచేసే పనులూ, అతనికుండే అలవాట్లూ, మరింత ఆసక్తికరంగా కనిపించి, ఆహ్లాదాన్నీ, ఆప్యాయతనీ కలిగించసాగాయి, వాళ్ళ వాళ్ళ మనస్సులలో.

హాస్పటల్‌లో చేరిన మర్నాడు యింకా తెల తెల్లవారకముందే, బెడ్ మీద చూస్తే రాంశాస్త్రి కనిపించలేదు. 'పేషెంట్ ఏమయినట్టు! బెడ్ మీద ఉన్నవాడు ఉన్నట్లే హారతి కర్పూరంలా హరించిపోయాడేవిటి? ఆ పేషెంట్ ఏడి అని హాస్పటల్ సూపరెండెంటు కరుణాకరం అడిగితే తను ఏం చెప్పేటట్టు' అంటూ హడలిపోతున్న పంకజం, శుభ్రంగా తలారా స్నానం చేసి, శుచిగా పిండిన తడిపంచె మధ్యకి మడిచి కట్టుకొని ఆదిత్య హృదయం చదువుకుంటూ హాస్పటల్ మెట్లు ఎక్కి తాపీగా వస్తూన్న రాంశాస్త్రిని చూడగానే, కోపంగా ఎంత కసురుకుందాం అనుకుందో, అంతగా నవ్వుతూ పలకరించింది.

"తెల్లారిపోయింది కదా అని లేచి పక్క చుట్టబెట్టేసి, అలా కిందకి వెళ్ళి ఓ వేపపుల్ల విరుచుకొని దంతధావనంచేసి ఆ గొట్టం దగ్గిర స్నానం చేసి చక్కా వచ్చాను. ఈలోపుగా హడలిపోవడందేనికి?" అన్నాడు రాంశాస్త్రి, అసలే పెద్దవైన కళ్ళని మరింత పెద్దవిచేసి పంకజంకేసి ఆశ్చర్యంగా చూస్తూ.

"మీరలా పక్క చుట్టబెట్టకూడదు. కిందకీ వెళ్ళ కూడదు. తెల్లారినా సరే మీరసలు మంచం దిగకూడదు."

"అదేమిటి? పగలుకూడా మంచంమీద పడుకొని వుండాలా? అసలు శాస్త్రాలు ఏం చెబుతూన్నయంటే..."

పక్కనున్న బెడ్ మీద పేషెంట్ నవ్వుతున్నాడు. వచ్చే నవ్వు ఆపుకొని, ఏప్రాన్ నోటికి అడ్డం పెట్టుకుంటూ వాటరు బోయ్ వెళ్ళిపోయాడు. పంకజానికి కోపం వచ్చింది.

"ఇక్కడ శాస్త్రాలు చెప్పినట్లు కాదు. మేం చెప్పినట్లు చెయ్యాలి తెలిసిందా?" అంది. ఆమె కళ్ళ చివర కనిపించిన ఎర్రదనం, కంఠంలో వినిపించిన అధికారస్వరం గమనించి, వెంటనే "అలాగేనండి... అలాగే" అంటూ తప్పుచేసిన బడిపిల్లవాడిలాగ తలవంచుకొని తన బెడ్ దగ్గిరికి వెళ్ళిపోయాడు రాంశాస్త్రి.

తర్వాత ఎంతసేపటి దాకానో 'ఎందుకంత కఠినంగా అన్నానా' అని బాధపడింది పంకజం.

ఓం అపవిత్రః పవిత్రోవా
సర్వావస్థాం గతోపివా
యస్మరే త్పుండరీకాక్షం
సభాహ్యాభ్యంతర శ్శుచిః

పుండరీకాక్ష ... పుండరీకాక్ష ...పుండ...

"ఏవిటా మంత్రాలు? స్పెషల్ వార్డులో ఏమైనా తద్దినాలు పెడ్తున్నారా ఏమిటి?" అంటూ గయ్‌మన్నాడు హాస్పటల్ సూపరెండెంట్ కరుణాకరం. ఆయన కంఠం వార్డు వార్డంతా ఖంగుమంటూ మారుమ్రోగింది. కరుణాకరం కోపం అందరికీ తెలుసు; అందుకే పంకజం ఒక్క పరుగుతీసింది స్పెషల్ వార్డు వైపు.

పంకజం పరుగు అంటే నిజంగా అది పరుగుకాదు. ఒక రాజహంసి తొందరగా అడుగులు వెయ్యడం. ఒక ఒంపు సొంపుల సెలయేరు వయ్యారాలు పోవడం - విరగబూసిన ఒక మాలతీ లత అలా అలా చిత్రంగా కదలడం - అది నిజంగా అపూర్వం - హాస్పటల్ స్టాఫ్‌కి ఎప్పుడోకాని లభించని వరం - వార్డులో పేషెంట్స్ ఎప్పుడూ చూడని మనోహర దృశ్యం.

అందుకే పేషెంట్ జబ్బలోకి సిరెంజి ఎక్కించిన ఒక సివిల్ అసిస్టెంట్ సర్జన్ ఇంజెక్షన్ ఇవ్వడం మరిచిపోయి, స్టిల్ ఫోటోగ్రఫీలా వుండిపోయాడు. బేసిన్‌తో నీళ్ళు పట్టుకొస్తూన్న వాటర్‌బోయ్, బేసిన్ ఆపళంగా నేలమీదికి వదిలేసి, పక్కనుంచి

వెళుతూన్న డాక్టరమ్మచేత పట్టుచీర పాడైనందుకు చీవాట్లు తిన్నాడు. ఆపరేషన్ థియేటర్ లోంచి ఏదో ఆవాంతరం జరిగిందనుకుంటూ బయటికి వచ్చిన సర్జన్‌లు, ఎర్రని కత్తులతో దుర్జనుల్లా ఆమట్టునే నిలబడిపోయారు. పక్క వార్డులోంచి మళ్ళీ ఈ అవకాశం రాదంటూ పరుగుపరుగున వచ్చారు కొందరు మగవాళ్లు. పరిగెడుతూన్న జనాన్ని చూసి 'పరిగెడుతున్నారేం? హాస్పటల్ కాని అంటుకోలేదు కదా!' అంటూ కొంతమంది పేషెంట్లు బెడ్స్‌మీంచి గాభరాగా లేచి కూర్చున్నారు. తన వెనక హాస్పటల్ హాస్పటల్ అంతా యిలా తలక్రిందులైపోతోందన్న సంగతినేం గమనించకుండా, గబగబా పంకజం ఒకటో నెంబరు బెడ్ దగ్గరికి పరిగెట్టింది.

బెడ్‌పక్క, నేలమీద అంగవస్త్రం వేసి, దానిమీద మఠం వేసుకుని కూర్చుని, ఎదురుగుండా పంచపాత్రలో ఉన్న నీళ్ళని ఉద్ధరిణిద్వారా పురిషెడులోంచి గొంతులోకి రవాణాచేస్తూ 'ఓం... కేశవాయస్వాహా... నారాయణాయ స్వాహా...' అంటూన్నాడు రాంశాస్త్రి.

"కేశవా లేదు నారాయణా లేదు, ఆపండి" అంది పంకజం. పూర్వం మహర్షుల తపస్సుల్ని భగ్నం చెయ్యడం కోసం రంభాది అప్సరసల్ని దేవేంద్రుడు ఏర్పాటుచేసినట్లు, తనలాంటి ఆయుతాగ్నులైన రోగుల సంధ్యావందనాన్ని పాడుచెయ్యడంకోసం అందమైన నర్సుల్ని హాస్పటల్ వారు సిద్ధంచేసి వుంటారన్న అనుమానం చటుక్కున కలిగింది రాంశాస్త్రికి. అందుకే ఆపకుండా, కంఠం మరింత హెచ్చించి "మాధవా, గోవిందా, విష్ణూ..." అంటూ సంధ్యావందనం సాగించబోయాడు.

చుట్టూ సంధ్యావందనం తాలూకు నీళ్ళతడీ, చీదరా, ఆపైన యెవరికి ఏపనీ తొణక్కుండా ఉదాత్త అనుదాత్త స్వరితాలతో రాంశాస్త్రి చేస్తూన్న సంధ్యావందనం. పంకజం ఓర్పు నశించింది. ఇంక ఊరికే చూస్తూ ఉండలేకపోయింది. ఉద్ధరిణితో నీళ్ళు తీసుకోబోతూన్న రాంశాస్త్రి ఎడంచేతిని, తటాలున పట్టుకుంది 'ఆపండి' అంటూ.

ఆమె చెయ్యి తగిలేసరికి రాంశాస్త్రికి ఒళ్ళంతా ఒక్కమారు ఝల్లుమంది. నిలువెల్లా కంపించిపోయి కళవళ పడిపోయాడు. ఇంక అతనికి నోటి వెంట మాట రాలేదు. సంధ్యావందనం నడవాలేదు. కిక్కురుమనకుండా లేచి వెళ్ళి బెడ్ మీద కూచున్నాడు.

అలాంటి సంచలనం పంకజంలోనూ కలిగింది. తొందరపడి అతని చెయ్యి పట్టుకొన్నందుకు సిగ్గుపడింది. తప్పుచేసిన దానిలా తడబడుతూన్న అడుగులతో

వెనక్కి వచ్చేసింది. 'అయ్యో! ఆ ఒకటో నెంబరు పేషెంటుకి పట్టినపాటి అదృష్టమైనా మనకి పట్టకపోయిందే - పంకజంలాంటి అందగత్తె చెయ్యిమాట అలా వుంచి, గోరయినా మనకి ఇంతవరకూ తగల్లేదు. అధమం ఆమె గాలి అయినా సోకలేదు. ప్చ్. ఇంతకీ ఎవరి అదృష్టం ఎవరికి వస్తుందీ' అనుకుంటూ ఎవరి పనుల్లోకి వాళ్ళు వెళ్ళిపోయారు, పెద్ద పెద్ద ఎమ్‌డీ. లూ ఎమ్.ఎస్.లతో సహా.

బెడ్ మీదకి వెళ్ళి కూచున్నాడన్నమాటేకాని రాంశాస్త్రికి ఏం స్థిమితం లేదు. ఒళ్ళంతా ముచ్చెమటలు పోయసాగాయి. గుండె వేగంగా కొట్టుకోసాగింది. ఉన్నట్టుండి శరీరం వేడెక్కి పోయింది. సలసలా కాగిపోతోంది. ఆవిర్లు వస్తోంది. మంట... వళ్ళంతా మంట.... అయ్యో భగవంతుడా.. తన వ్యాధి ముదురుతోంది కాబోలు! రాంశాస్త్రికి అధైర్యం తోచింది.

"చేతులు మంట! కాళ్లు మంట! కడుపులో మంట! ఒళ్ళంతా తెగ మండిపోతుంది.... నాకేవిటి దారి? డాక్టరు గారూ - ఓ డాక్టరుగారూ" అంటూ హాస్పటలు అంతా మారుమ్రోగేలా కేకలు మొదలెట్టాడు రాంశాస్త్రి.

పంకజం ఈ మారు పరి గెట్టుకుంటూ రాలేదు రాంశాస్త్రి దగ్గరికి. వరండా ఆ చివర నిలబడే గట్టిగా అడిగింది. "ఏంకావాలి? ... గంట గంటకీ అలా అరిస్తే ఎలా?" అని.

"గంటేమిటి మంట అంటూంటే? మంట ... మం...ట.... వినిపించటం లేదూ? నీకు చెవుడుకూడా నేమిటి ఖర్మ" అని విసుక్కుంటూ సంజ్ఞలు చేస్తూ మరీ చెప్పాడు రాంశాస్త్రి.

అతని అభినయం చూస్తే నవ్వువచ్చింది పంకజానికి. "మంచి ఆకారానికి తోడు భరత నాట్యం కూడా వచ్చునే మీకు" అంది ఓ పేషెంట్‌కి టెంపరేచరు చూస్తూ.

"ఆ ... భరతనాట్యంలాగేవుంది. కబుర్లతో కాలక్షేపం చెయ్యక చప్పున డాక్టర్ని పిలు" అన్నాడు గట్టిగా.

మరో పేషెంట్‌కి మందు యిస్తూ "పిలవక్కర్లేదు. ఆయనే వస్తారు. వేళయింది. కాస్సేపు ఆగండి" అంది పంకజం.

"నేను ఆగినా ఈ ప్రాణం ఆగేలా లేదే" అన్నాడు రాంశాస్త్రి కంఠం హెచ్చిస్తూ.

"మరేం ఫరవాలేదు" నవ్వుతూ అంది పంకజం.

రాంశాస్త్రికి ఒళ్ళు మండుకొచ్చింది. "ఫరవాలేదూ? అనుభవించేవాడిని నేనయితే మధ్యన నీ భరోసా ఏవిటి నాకూ? అమ్మో తల బరువు... బరువెక్కిపోతోంది."

"తల బరువా? ఒళ్లుమంట ఏమైందీ! అది తగ్గిందా?"

"ఇదిగో నువ్వు నన్ను అట్టే విసిగించకు. నాబాధేదో నేను పడతాను. నీ పని నువ్వు చూసుకో. తలబరువు మొత్తో అంటూంటే ఒళ్లు మంట తగ్గిందా అంటావేమిటి అర్థం లేకుండాను...?"

"అది కాదండీ! ఈ బాధ వచ్చాక ఆ బాధ తగ్గిందా? లేక రెండు బాధలూ...."

"రెండేవిటి, లక్ష బాధలున్నాయి. అసలున్నవే బాధలు" అంటూఅరిచాడు రాంశాస్త్రి.

ఒక పేషెంట్ చార్ట్‌మీద రీడింగ్ నోట్ చేస్తూ పంకజం గట్టిగా "అది సరే..." అంటూ ఏదో చెప్పబోయింది.

"ఏమిటా వార్డులో గొడవ? ట్రంక్‌కాల్‌లో అరిచినట్లు నువ్వీ మూల నుంచీ, ఆయన ఆ మూల నుంచీ. ఏవిటా అరుపులు?" అంటూ కస్సుమన్నాడు అప్పుడే రౌండ్సుకి వచ్చిన డాక్టర్ ముకుందం.

పంకజం ముఖం చిన్నబుచ్చుకుంది.

రాంశాస్త్రి కూడా నొచ్చుకున్నాడు. 'అయ్యో! నా మూలంగా పాపం ఆ అమ్మాయి మాటపడిందే!' అని.

ముకుందం అందించిన ధర్మామీటర్ చేత్తో పట్టుకుని "ఏమండీ ఈ జ్వరం కొలిచే గొట్టాల్ని ఒక్కొక్క రోగికి ఒక్కొక్కటి చొప్పున కొంటారా ప్రభుత్వంవారు?" అన్నాడు రాంశాస్త్రి అమాయకంగా.

"ఊహూ... ఒకటే అందరికీ ఉపయోగిస్తారు."

"ఏవిటీ? ఒకరి నోట్లోంచి తీసినది ఇంకొకరి నోట్లో ఉంచుతారా?... హరి ... హరి... అంతా ఎంగిలి మంగలం... ఛీ....ఛీ....ఛీ..." అసహ్యించుకున్నాడు రాంశాస్త్రి.

"మీరు ముందా ధర్మామీటర్ నోటిలో పెట్టుకోండి మాట్లాడక" అంటూ అరిచాడు ముకుందం.

"ఇది ఎందుకు? పోనీ చెయ్యి చూడకూడదూ, మా సోమాచారిలాగ? చేతిలో వాతం వుందో లేదో తేలిపోతుంది."

"మీరు ముందు ఆ! అనండి" గట్టిగా అన్నాడు ముకుందం. ఇంక తప్పదురా భగవంతుడా అనుకుంటూ ధర్మామీటర్ నోట్లో పెట్టుకున్నాడు రాంశాస్త్రి. పెట్టుకొని "ఏమండీ డాక్టరుగారూ? నాకు వచ్చిన ఈ జబ్బేమిటి?" అని అడిగాడు.

"ఉష్... మాట్లాడకండి" అన్నాడు ముకుందం.

"నే నెన్నాళ్లుండాలి ఈ ఆసుపత్రిలో?"

"మాట్లాడవద్దంటూంటే..."

"నా కసలీ జబ్బు తగ్గుతుందా? నేను బతుకుతానా?"

"నోట్లో థర్మామీటరుండగా మాట్లాడకూడదు" అంటూ ఛార్ట్ మీద టెంపరేచర్ నోట్ చేసి, రాంశాస్త్రి అడిగిన ప్రశ్నలకి వేటికీ సమాధానం చెప్పకుండా వెళ్ళి పోయాడు డాక్టర్ ముకుందం.

రాంశాస్త్రికి ఒళ్ళు మండుకొచ్చింది. ఒక్కళ్ళూ తను అడిగిన దానికి సమాధానం చెప్పరు. లే- కూచో-పడుకో - అటు తిరుగు యిటు తిరుగు - నాలిక జాపు అంటూ తనని నానాహింసలూ పెట్టేవాళ్ళేగానీ "నాయనా నీ బాధ ఏమిటి? ఏం కంగారుపడకు, తగ్గిపోతుంది" అంటూఅనునయంగా ఒక్కమాట, ఒక్కటంటే ఒక్కమాట అనేవాళ్లు లేరు. నేరకపోయి ఈ నరకంలోకి వచ్చి పడ్డానురా దేవుడా, అనుకుంటూ ఏక మధనపడుతూన్న రాంశాస్త్రికి "ఏవండీ మందు తీసుకుంటారా?" అన్న పంకజం పలకరింపు, మండిపడుతూన్న హృదయం మీద పన్నీటిజల్లులా చల్లగా వినిపించింది.

"అవునుగానీ, నీ పేరేమిటీ?" అన్నాడు రాంశాస్త్రి. తను డ్యూటీలో చేరాక ఈ రెండు మూడేళ్ళనుంచీ అంతా సిస్టర్... సిస్టర్ అని పిలవడమేకాని, ఎవరూ తన పేరు అడగలేదు. అందుకే ఆ ప్రశ్న చిత్రంగా వినిపించింది పంకజానికి. మనస్సంతా కాస్సేపు సంతోషంగా ఉక్కిరి బిక్కిరి అయిపోయింది. కొంచెంసేపటికి స్థిమితపడి "పంకజం" అని చెప్పింది మెల్లిగా.

"పంకజం..... చాలా మంచి పేరు" అన్నాడు రాంశాస్త్రి తను అమరకోశంలో చదువుకొన్న తామరపువ్వుకి వున్న రకరకాలైన పేర్లన్నీ జ్ఞాపకం తెచ్చుకుంటూ. అతనామాట అనగానే సిగ్గుతో పంకజం బుగ్గలు రెండూ ఎర్రబడ్డాయి.

"అవునుగాని పంకజం..."

అతనలా తనని పేరుపెట్టిపిలిచేసరికి పంకజం ఒళ్ళంతా ఒక్కసారి గగుర్పొడిచింది.

"ఎంతమందిని అడిగినా సరిగ్గా సమాధానం చెప్పడం లేదు. నాకు వచ్చిన ఈ జబ్బేవిటి? నే నెన్నాళ్లుండాలి యిక్కడ? ఈ వ్యాధి తగ్గి, నేనసలు బతుకుతానా-నువ్వేనా చెబుదూ కాస్త" అంటూ ప్రాధేయపూర్వకంగా అడిగాడు రాంశాస్త్రి.

అతణ్ణి చూస్తే పంకజానికి జాలేసింది. "పెద్ద పెద్ద డాక్టర్లే ఇంకా ఈ వ్యాధి ఏదో తెలియక, చర్చలూ ఆలోచనలూ తెమలక, తలలు బద్దలుకొట్టుకుంటూంటే, తనేం చెప్పగలదు?" "మీరు అధైర్యపడకండి తగ్గిపోతుంది. అసలు మీరా ఆలోచనేం పెట్టుకోకుండా కాస్సేపు కళ్లుమూసుకు పడుకోండి. తర్వాత చెప్తాను మీ ప్రశ్నల కన్నింటికీ సమాధానాలు. ఏం?" అంటూ మాటలతో బుజ్జగించి గుండెలదాకా

దుప్పటి కప్పి వెళ్ళిపోయింది పంకజం. ఆమె వెళ్ళిన దిక్కే చూస్తూ కాస్సేపటికి పసివాడిలా నిద్దరపోయాడు రాంశాస్త్రి.

నిదట్లో ఎన్నో కలలు.

ఒక డాక్టరైతే పరాకుగా వున్న తనకి చటుక్కున ఇంజక్షన్ చేసి వెళ్ళిపోయాడు, "ఓరి యములాడా! ఎంతపోటు పొడిచావయ్యా వున్నట్టుండి" అంటూన్న తన ఆక్రోశాన్నేం వినిపించుకోకుండా.

మరో డాక్టరు, లేడీ డాక్టరుతో కలిసివచ్చి, తన గుండెల మీద స్టెతోస్కోపు పెట్టి, గట్టిగా లోపలికి గాలి పీల్చుకోమని చెప్పి, యింకామట్టుని లేడీ డాక్టరుతో కబుర్లలో పడ్డాడు. ఒకటే కబుర్లూ నవ్వులూ. స్టెతోస్కోపు తన గుండెలమీద బరువుగా ఆమట్టునే ఉండిపోయింది. గాలి పీల్చుకున్న తను, అలా ఎంతసేపు వుండిపోవాలో, గాలి యింక వదలవచ్చో వదలకూడదో తెలియదు. ఎంత సేపు యిలా ఉగ్గబట్టుకుని ఉండడం... చివరికి తెగించి అడిగేశాడు. "అయ్యా యింక నేను గాలి వదలవచ్చా?" అని - ఆ డాక్టరూ. డాక్టరమ్మా ఉలిక్కిపడి... ఆ... అంటూ కంగారుగా వెళ్ళిపోయారు.

ఒక పెద్దమనిషైతే వచ్చి తన పక్క ఎముకలమీద వేళ్లు పెట్టి, డోలు వాయించినట్లు వాయించాడు. మరో కళ్ళజోడాయన వేళ్ళతో డొక్కల్లో పొడిచేడు. మరో కుర్రకుంక వచ్చి, రక్తం వంట్లో వుందో లేదో అని చచ్చేలా వేళ్ళ చివర గోళ్ళు నొక్కేశాడు. ఒకడు కనురెప్పలు లాగితే మరొకడు నాలిక పీకాడు. ఈ చిత్ర హింసలు నేను భరించలేను భగవాన్ అనుకుంటూన్న సమయంలో, ఒక ప్రొఫెసరుట ఎవరో నలుగురైదుగురు విద్యార్థుల్ని వెంటబెట్టుకుని వచ్చి, సంతలో గొడ్డుని పరీక్షించినట్లు పరీక్షించి అటుదొర్లు - యిటు తిరుగు - కొద్దిగా దగ్గు - నోరు తెరు - చెయ్యి జాపు" అంటూ తనచేత సర్కస్‌ఫీట్లు చేయించాడు. చివరికి ఆ విద్యార్థులు నలుగురూ కలిసి, తనకి గుండె జబ్బూ, మానసికరోగం, ఊపిరితిత్తుల వ్యాధీ, జీర్ణకోశంలో రుగ్మతా వున్నాయని తలో నిర్ధారణా చేసి మరీ చక్కా పోయారు. తనకి గుండె ఆగినంతపని అయింది. అవన్నీ కలిపిన ఏదో తీవ్రవ్యాధి ఉంది తనకి - ఎవర్నీ వదలకుండా, వచ్చిన అందర్నీ అడిగాడు తను "నాకు వచ్చినవ్యాధి ఏమిటి? ఎన్నాళ్ళీ ఆసుపత్రిలో ఉండాలి? అసలు నేను బతుకుతానా బతకనా?" అంటూ. ఒక్కరూ ఒక్క దానికీ సమాధానం చెప్పలేదు. ఇంక తనకి సహనం హద్దులు దాటింది.

"ఇంకెవరూ నన్ను పరీక్షించడానికి రాకండి - పొండి - మీ ప్రశ్నలకి నేనింక చచ్చినా సమాధానాలు చెప్పను. నేనేం వెర్రివెంగళాయిని అనుకుంటున్నారేవిటి? ఈ ఊరికి ఆ ఊరు ఎంతో, ఆ ఊరికి ఈ ఊరూ అంతే - ఆ ... అంతే."

-అంటూ గట్టిగా పలవరిస్తూన్న రాంశాస్త్రిని తట్టి లేపుతూ "ఏమిటలా పలవరిస్తున్నారు!" అంది పంకజం. రాంశాస్త్రి కళ్ళు నులుపుకొని లేచి కూచున్నాడు. దేవలోకంలోంచి దిగివచ్చిన దేవకన్యలా తెల్లని గౌను, నెత్తి మీద తెల్లని హుడ్, పిక్కలదాకా తెల్లని సాక్సూ వేసుకొని నవ్వుతూ నిలబడింది పంకజం.

"ఏమిటి యిదంతా కలా? యిది పగలా రాత్రా యిప్పుడెంతైంది?" అన్నాడు రాంశాస్త్రి.

"మీరు పగటి కలలు కంటున్నారు కానీ - యిదిగో యిటు చూడండి. ఈయన డాక్టర్ సుధాకరంగారని మద్రాసునుంచి ప్రత్యేకం మిమ్మల్ని కొన్ని ప్రశ్నలడగడానికి వచ్చారట - హాస్పటల్ సూపరెండెంటు కరుణాకరం గారు నన్ను పిలిచి మిమ్మల్ని ఈయనకి పరిచయం చెయ్యమన్నారు. ఈయనేవో కొన్ని ప్రశ్నలు మిమ్మల్ని అడుగుతారట. సమాధానాలుచెప్తూ ఉండండి. నేను ఇంతట్లోకీ మీకు బ్రెడ్డూ మిల్కూ పట్టుకొస్తాను" అంటూ పంకజం వెళ్ళిపోయింది.

'వచ్చినవాళ్ళు చాలక మళ్ళీనువ్వొకడివా నాయనా?... ప్రశ్నలు అడుగుతావా? ...ఏం - రాంశాస్త్రి ఒట్టి పిచ్చివాడిలా కనిపిస్తూన్నాడేవిటి మీ ప్రాణానికి? నువ్వు అడిగిన దానికి నేను సమాధానాలు చెప్పాలా? నా ప్రశ్నలకి నువ్వు జవాబులు చెప్పనక్కర్లేదూ' అని మనసులో అనుకుంటూ డాక్టర్ సుధాకరం కేసి పుల్తూ పుల్తూ చూశాడు రాంశాస్త్రి.

నోట్ బుక్కూ పెన్నూ రెడీగా చేత్తో పట్టుకుని "ఊ... నేనడిగే ప్రశ్నలకి సమాధానం చెప్పండి. ఒకటి. మీ పేరు?" అన్నాడు సుధాకరం.

రాంశాస్త్రి ఏం మాట్లాడలేదు.

"రెండు... మీ వయస్సు? మూడు - మీకు యెప్పటినుంచి ఈ జబ్బు వచ్చింది?"

పెదిమలు బిగించుకుని మరీ కూచున్నాడు రాంశాస్త్రి.

"నాలుగు ... అదేవిటి మీరు దేనికీ సమాధానం చెప్పకుండా మౌనంగా కూర్చున్నారు! నా ప్రశ్నలు మీకు వినిపిస్తున్నాయా? మీకు చెవుడు లేదుగదా?"

"ఆ ... అదొక్కటే తరువాయి?"

"అరే.. మరి వినిపిస్తూంటే సమాధానం చెప్పరేం?"

"నేను చెప్పనంతే."

"ఏం"

"అది అంతే - మీరంతా అదొక తరహా మనుషులు. మీ ప్రశ్నలకి మేం జవాబులు చెప్పాలికాని మేం అడిగే వాటికి మీరు చెప్పరు."

"ఓ... అదా మీకోపం... చంపేశారు... ఊ... అయితే ముందు మీరే అడగండి."

"ఆనక మాట తప్పరుగా?"

"ఎందుకు?"

"మరి అడగనా?"

"ఊ..."

"అయితే చెప్పండి. నాకు వచ్చిన ఈ జబ్బేవిటి?"

"ఇంకా దానికి పేరు పెట్టలేదు. ఫలానా అని అంతుచిక్కలేదు యెవరికీ యింతవరకూ."

"చూశారా మాట తప్పుతున్నారు. పోనీ ఈ రెండో ప్రశ్నకి సమాధానం చెప్పండి. నేను యెన్నాళ్లుండాలి ఈ ఆసుపత్రిలో".

"అది నాకెలా తెలుస్తుంది?"

"పొండి... మీకు అనృతదోషం వస్తుంది."

"నిజం... నామాట నమ్మండి ... నాకు తెలియదు."

"సరే - ఆఖరి ప్రశ్న. దీనికైనా జవాబు చెప్పండి. నాకీ వ్యాధి తగ్గి నేను బతుకుతానా?"

"తప్పకుండా."

"ఏ...వి..టి?"

"ఆ.. అటు సూర్యుడిటు ఉదయించినా, సప్తసముద్రాలు యింకిపోయినా, మేరువు తలక్రిందులైనా మీరు బ్రతుకుతారు... బ్రతికే తీరుతారు."

"ఆహా... ఎంత చల్లని వార్త చెవిని వేసారండి... వైద్య శాస్త్రం మీరెక్కడ చదివారో కానీ అసలు డాక్టరు అంటే మీరు, తక్కిన డాక్టర్లేం డాక్టర్లండి."

"చంపేశారు. డాక్టర్ సుధాకరం అంటే మీరు నన్ను నిజంగా డాక్టరు అనుకున్నారేవిటి కొంపదీసి! నా డాక్టరు డిగ్రీ, వైద్య రీత్యా వచ్చింది కాదు. రీసెర్చివల్ల వచ్చింది."

"ఏవిటి? మీరు డాక్టరుకాదూ?"

"ఊహూ! నేనొక మందుల కంపెనీకి సంబంధించిన స్టేటిస్‌టిక్స్ ఎక్స్‌పర్ట్‌ని. అంటే, రకరకాల అంకెల జాబితాలని సేకరించి, వాటి సహాయంతో కొన్ని నిర్ణయాలకి వచ్చే గణాంక శాస్త్రజ్ఞుణ్ణి అన్నమాట."

"మరయితే మహామహా డాక్టర్లే తేల్చి చెప్పలేకుండా వున్న సంగతి, 'నువ్వు తప్పకుండా బతికేతీరుతావు' అని ఒక్క క్షణంలో ఘంటాపథంగా ఎలా చెప్పావయ్యా నువ్వూ" అంటూ ఆశ్చర్యంగా చూశాడు రాంశాస్త్రి.

"అదా? అది చాలా సింపుల్. ఈ మధ్య ఈ కొత్త జబ్బు ఏదో దేశవ్యాప్తంగా పాకుతోందని తెలిసి, మా కంపెనీ వాళ్ళు దీనికో కొత్త మందుకనిపెట్టి కోట్లు సంపాదించాలనే ఉద్దేశంతో, అన్ని జనరల్ హాస్పటల్స్‌కి వెళ్ళి వివరాలు సేకరించి రమ్మని నన్ను పంపారు. కాశ్మీరునుంచి కన్యాకుమారిదాకా ఉన్న ముఖ్యమైన హాస్పటల్స్ అన్నీ చూపివస్తున్నా. ఎక్కడ చూసినా ఈ జబ్బు వచ్చినవారిలో నూటికి డెబ్భై అయిదుమంది ఏం అవుతున్నారో కాని, మిగిలిన పాతికమంది మాత్రం శుభ్రంగా తగ్గి, హాయిగా జీవితయాత్ర సాగిస్తున్నారు. అంటే నలభైమందికి ఈ వ్యాధి సోకితే పదిమందికి గ్యారంటీగా నయం అవుతోంది. ఆ లెఖ్ఖని చూస్తే ఈ హాస్పటలులో ఈ జబ్బు వచ్చినవారిలో మీరు నాలుగవవారుట. తక్కిన ముగ్గురికీ పాపం తగ్గకుండానే వెళ్ళిపోయారట. అందువల్ల మా గణాంక శాస్త్రం లెఖ్ఖల ప్రకారం, మీకు తగ్గే తీరాలి. తగ్గకపోతే మా శాస్త్రం ఏమయ్యేటట్టు - యిండియన్ స్టాటిస్‌టిక్స్ పరువు ఏమయ్యేటట్టు? అందువల్ల..."

సుధాకరం వాక్యం యింకా పూర్తి కానేలేదు "ఏమిటి? నీ లెఖ్ఖల ప్రకారం నేను బతుకుతానా? నా ఆరోగ్యం కారణంగా కాదన్నమాట!... ఇంకొక్క క్షణం యిక్కడ నిలబడ్డావంటే జాగ్రత్త... ఊఁ... వెళ్తావాలేదా?" అంటూప్రళయరుద్రుడిలా లేచాడు రాంశాస్త్రి.

పడుతూ లేస్తూ పారిపోతున్న సుధాకరంని చూసి "ఏమైందంటూ" వచ్చింది పంకజం రాంశాస్త్రి దగ్గిరికి. జరిగింది చెప్పి రాంశాస్త్రి నవ్వా, పంకజం నవ్వా, ఒకటే నవ్వులు.

హాస్పటలు సూపరెండెంట్ కరుణాకరం, ముకుందం, సుందరంవంటి సీనియర్ డాక్టర్లూ, మెడికల్ కాలేజీలో పేథాలజీ ప్రొఫెసరుగా పనిచేస్తున్న డాక్టరు రావు, ఒకళ్ళిద్దరు ఎమ్.డీ.లూ వీళ్ళంతా రాం శాస్త్రికి వచ్చిన జబ్బేదో యింకా తేల్చుకోనేలేదు చర్చలు ఇంకా సాగుతూనే వున్నాయి. "మీ ఆసుపత్రికో దణ్ణం" అంటూ హాస్పటల్ వదిలి వెళ్ళిపోయాడు రాంశాస్త్రి. "స్పెసిమన్‌గా నువ్వు వుండకపోతే మాశ్రమంతా వృధా అయిపోతుందోయ్! నువ్వులేకపోతే మేం ఎవరిమీద ఎక్స్‌పెర్మెంట్స్ చేసేటట్టు!" అంటూన్న వాళ్ళ అభ్యర్దనల్ని ఏం ఖాతరు చెయ్యకుండా రాంశాస్త్రి ఎందుకు

వెళ్ళిపోయాడో వాళ్ళకర్థం కాలేదు. "పాపం యింక తగ్గదని నిరాశజేసుకుని వెళ్ళిపోయాడు కాబోలు రాంశాస్త్రి" అని జాలిపడిన హాస్పటలు స్టాఫ్‌కి, పంకజం తన ఉద్యోగానికి హఠాత్తుగా ఎందుకు రాజీనామా చేసిందో అర్థంకాలేదు. అలాగే, పదిరోజులు మెడికల్ లీవు పెట్టిన రాంశాస్త్రి, అయిదురోజులు కేన్సిల్ చేసుకుని మధ్యలోనే వచ్చి డ్యూటీలో యెందుకు చేరుతున్నాడో ప్రధానోపాధ్యాయుడికీ అర్థంకాలేదు. "ఎలా వుందయ్యా యిప్పుడు నీ వంట్లో" అన్న ప్రధానోపాధ్యాయుడి ప్రశ్నకి సిగ్గుపడుతూ "పోండి మేష్టారూ - మీరు మరీనూ" అని రాంశాస్త్రి ముసిముసి నవ్వులు నవ్వినప్పుడూ అర్థంకాలేదు ఎవరికీ.

అయితే హాస్పటల్‌లో ఒకటి రెండు రోజులు ఒకటో నెంబరు బెడ్‌మీద పడుకున్న రాంశాస్త్రి, ఒక రోజున తను కొత్తగా కొనుక్కున్న డబుల్‌కాట్ మీదకి, ఖరీదైన ఒకటో నెంబరు బెడ్‌ని షాపులో పంకజంతో కలిసి బేరం ఆడి, కొంటూండగా చూసిన ఒకరిద్దరు అధ్యాపకులికి మాత్రం, ఏదో లీలగా అర్థం అయినట్లనిపించింది అంతవరకూ అర్థం కాకుండా ప్రశ్నార్థకంగా మిగిలిపోయిన రాంశాస్త్రీ, అతనికి వచ్చిన అనారోగ్యం, ఒకటో నెంబరు బెడ్ వైద్యం, కధా, కమామీషూ, వగైరా వగైరా అంతా.

అందుకే ఆ మిత్రబృందం ఇవాల్టికీ సరదాగా అప్పుడప్పుడు అంటూ వుంటుంది రాంశాస్త్రి వినేలాగ "మన రాంశాస్త్రికి వచ్చిన ఆ అపూర్వమైన వ్యాధి పెద్ద పెద్ద డాక్టర్లకి అంతుచిక్కలేదు కాని, పంకజానికి అర్థం అయింది. ఆమె ఆదుకుంది కనకనే మనవాడి ఆరోగ్యం యిలా కుదుటబడింది. యింతకీ మన రాంశాస్త్రికి వచ్చిన జబ్బేవిటో తెల్సా! ఒకటో నెంబర్ బెడ్! ... ఏం? ... అంతే కదూ రాంశాస్త్రి?" అని

ఎవరు ఏం అన్నా రాంశాస్త్రిది ఒకే ఒక సమాధానం - అప్పటికీ యిప్పటికీ - చిన్న చిరునవ్వు - అంతే -

*(1970 - యువ)*